హైకోర్టులోని అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న హైకోర్టు సీజే అలోక్ అరాధే

అంబేద్కర్ సేవలు ప్రపంచానికే ఆదర్శనీయం

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సేవలు ప్రపంచానికే ఆదర్శనీయమని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే శ్లాఘించారు. అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా ఆదివారం హైకోర్టు బార్ అసోసియేషన్ హాలులో నిర్వహించిన కార్యక్రమానికి జస్టిస్ అరాధే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రిజర్వు బ్యాంకు, ఫైనాన్స్ కమిషన్ లాంటి వ్యవస్థలను ఏర్పాటు చేయాలన్న అంబేద్కర్ దూరదృష్టిని కొనియాడారు. అణగారిన వర్గాలకు రిజర్వేన్లు కల్పించడం ద్వారా సమసమాజ స్థాపన కోసం అంబేద్కర్ చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని చెప్పారు. అంబేద్కర్ అనుసరించిన మార్గం ఎప్పటికీ అనుసరణీయమేనని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శామ్ కోషి అన్నారు. జస్టిస్ గిరిజా ప్రియదర్శిని, జస్టిస్ నగేశ్ భీమపాక ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన ఈ కార్యక్రమంలో హెచ్‌సీఏఏ అధ్యక్షుడు అయ్యాడపు రవీందర్‌రెడ్డి, బార్ కౌన్సిల్ చైర్మన్ ఏ నరసింహారెడ్డి, ఏఎస్‌జీ నరసింహశర్మ, డీఎస్‌జీ గాడి ప్రవీణ్‌కుమార్, పీపీ నాగేశ్వర్‌రావు, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు సునీల్‌గౌడ్, మాజీ ఏజీ బీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ లోయర్‌ట్యాంక్‌బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సికింద్రాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ తదితర నాయకులు

ఘనంగా అంబేద్కర్ జయంతి

- లోయర్ ట్యాంక్‌బండ్‌లో నివాళులర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- ఎంపీలు, ఎమ్మెల్యేలు, దళిత సంఘాల నేతలు

కవాడిగూడ, ఏప్రిల్ 14: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 133వ జయంతిని ఘనంగా ఆదివారం నిర్వహించారు. లోయర్ ట్యాంక్ బండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు ఎం అనిల్‌కుమార్‌యాదవ్, సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్, మాజీ కార్పొరేటర్ పీ విజయారెడ్డి, మాజీ మేయర్ బండా కార్తీకరెడ్డి, అద్దంకి దయాకర్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ మంత్రి, సికింద్రాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీ అజీజ్ పాషా, ప్రొఫెసర్ కోదండరాం, బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం, సభ్యుడు సీహెచ్ ఉపేందర్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంకుమార్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్యే చింతల్ల, మాజీ ఎంపీ హెచ్, మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్, తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జీ చెన్నయ్య తదితర దళిత సంఘాల నాయకులు నివాళులర్పించారు.

అంబేద్కర్ చిత్రపటానికి ఘన నివాళి

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ) : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆదివారం హైదరాబాద్ కళాభవన్‌లో ఆయన చిత్రపటానికి ఆర్టీసీ ఈడీలు కృష్ణకాంత్, ముని శేఖర్, పురుషోత్తం, వెంకటేశ్వర్లు, ఎఫ్ఏ విజయ పుష్ప, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘ నాయకులు, ఉద్యోగులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ట్యాంక్‌బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు, ప్రధానకార్యదర్శి సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు బీ శ్యామ్, ఏ జగన్‌మోహన్‌రావు, ఉపేందర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

అంబేద్కర్ అంటే కాంగ్రెస్‌కు చిన్నచూపెందుకు?

- జయంతిని అధికారికంగా ఎందుకు నిర్వహించలేదు?
- టీఎస్ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కార్ కావాలనే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించలేదని టీఎస్ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ ధ్వజమెత్తారు. అంబేద్కర్ అంటే కాంగ్రెస్‌కు చిన్నచూపెందుకని, అధికారికంగా జయంతిని ఎందుకు జరుపదని నిలదీశారు.అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో నిర్లక్ష్యం వహించిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లోయర్ ట్యాంక్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పించడానికి వచ్చిన ప్రజల కోసం కనీస వసతులు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఈ సారే అంబేద్కర్ జయంతి ఉత్సవాల నిర్వహణకు కమిటీ ఏర్పాటు చేయలేదని, ఇందుకు రేవంత్‌రెడ్డి సర్కార్ రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాలని ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో ఉత్సవ కమిటీ అధ్వర్యంలో అన్ని మండల, జిల్లాకేంద్రాల్లో అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగేవని, కాంగ్రెస్ ప్రభుత్వం ఈసారి ఎలాంటి కమిటీ వేయలేదు... ఉత్సవాలూ నిర్వహించలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రపంచంలోనే ఎత్తయిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ సర్కార్ కనీసం ఆ విగ్రహానికి కనీసం పూలమాల కూడా వేయకపోవడం దారుణమని ధ్వజమెత్తారు.

అంబేద్కర్ అందరివాడు

- దళితులకు మాత్రమే నాయకుడు కాదు
- గాంధీకి ఏమాత్రం తగ్గని మహానుభావుడు
- రాజ్యాంగం ప్రమాదంలో పడకూడదంటే కొన్ని పార్టీల కుట్రను అర్థం చేసుకోవాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తెలంగాణభవన్‌లో అంబేద్కర్ జయంతి
- నివాళులర్పించిన కేటీఆర్‌సహా నేతలు



తెలంగాణ భవన్‌లో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేటీఆర్. చిత్రంలో నేతలు ఆర్ఎస్పీ, శ్రీనివాస్‌గౌడ్, మధుసూదనాచారి, గువ్వల, ఎర్రోళ్ల, పొన్నాల, రాజీవ్‌సాగర్, సుధాకర్ తదితరులు

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దళితులు, బడుగు బలహీనవర్గాలకు మాత్రమే చెందిన వ్యక్తి కాదని, ఆయన అందరివాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు చెప్పారు. అంబేద్కర్ ఆధునిక భారత నిర్మాత అని కొనియాడారు. జాతిపిత మహాత్మా గాంధీతో పోల్చి చూడదగిన, ఆయనతో సరిసమానమైన స్థాయిగల గొప్ప నాయకుడని కీర్తించారు. అంబేద్కర్ 134వ జయంతిని ఆదివారం తెలంగాణభవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్‌సహా మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్సీ శంభీర్‌పూర్ రాజు, మాజీ మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, పొన్నాల లక్ష్మయ్య, నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, బాల్క సుమన్, జీవన్‌రెడ్డి, నాయకులు డాక్టర్ చెరుకు సుధాకర్, ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి, రావుల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రమాదంలో పడకూడదంటే కొన్ని పార్టీల కుట్రలను ప్రజలు అర్థం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ ఆలోచన ధారకు అనుగుణంగా దేశంలోని అన్ని కులాలు, అన్ని మతాలు, వర్గాలు ముందుకుపోవాలని ఆకాంక్షించారు. అంబేద్కర్ మహనీయుడి ఆశయాల సాధన దిశగా అందరం ముందుకు సాగుదామని పేర్కొన్నారు.

అంబేద్కర్‌తత్వాన్ని ఆచరించే..

బోధించు.. సమీకరించు.. పోరాడు అన్న అంబేద్కర్ తత్వాన్ని పూర్తిస్థాయిలో అవగాహన చేసుకొని కేసీఆర్ నాయకత్వంలో 14 ఏండ్లపాటు తెలంగాణ కోసం పోరాడామని కేటీఆర్ పేర్కొన్నారు. ఉద్యమంలో లక్షలాదిగా ప్రజలను సమీకరించి, తెలంగాణ ఏర్పాటు ఆవశ్యకతను వివరించి, తెలంగాణ ప్రయోజనాలకు ఎక్కడ విఘాతం కలిగినా అంబేద్కర్ చూపిన మార్గంలో తాము పోరాటం చేశామని గుర్తుచేశారు. ప్రజా పోరాటంతోనే రాష్ట్రాన్ని సాధించుకున్నామని చెప్పారు. సాధించుకున్న తెలంగాణలో ప్రజల ఆశీర్వాదంతో, అంబేద్కర్ ఆశయాల ఆలోచనల మేరకు పదేండ్లు తమ ప్రభుత్వం పనిచేసిందని కేటీఆర్ తెలిపారు. విద్యతోనే వికాసం వస్తుందని, వికాసంతోనే ప్రగతి వస్తుందని, ప్రగతితోనే సమానత్వం సిద్ధిస్తుందన్న అంబేద్కర్ ఆలోచన ఆధారంగానే 1,022 గురుకులాలు, 1,005 జూనియర్ కాలేజీలు, 85 డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేశామని వివరించారు. ఈ గురుకులాల నుంచి ఉద్భవించిన లక్షల మంది తెలంగాణ భవిష్యత్తు ఆశాకిరణాలు అయ్యారని పేర్కొన్నారు. గురుకులాల పిల్లలు ఇప్పుడు ఐఐటీలు, ఐఐఎంలు సహా అనేక ఉన్నత విద్యాసంస్థల్లో చదువుతున్నారని వెల్లడించారు. ఒక మనిషికి ఒక ఓటు ఉన్నట్టుగానే కులరహిత సమాజంలో మనుషులందరికీ ఒకే రకమైన విలువ ఉండే సమానత్వం సమాజంలో రావాలని అంబేద్కర్ కాంక్షించారని కేటీఆర్ గుర్తుచేశారు. గురుకులాల్లో చదువుకున్న పిల్లలు అంబేద్కర్ ఆశయాలను నెరవేరుస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు.

విగ్రహం కాదు.. విప్లవం..

ప్రపంచంలోనే అతిపెద్దదైన 125 అడుగుల బాబాసాహెబ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆయనను సమున్నతంగా గౌరవించుకున్నామని కేటీఆర్ గుర్తుచేశారు. తాము ఏర్పాటు చేసింది విగ్రహం కాదు విప్లవమని ఆనాడే కేసీఆర్ చెప్పారని పేర్కొన్నారు. సచివాలయానికి బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు పెట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని చెప్పారు. దళితబంధు వంటి దమ్మున్న పథకం పెట్టినా.. బడుగు బలహీన వర్గాలు, దళిత గిరిజనవర్గాల కోసం రాజకీయ ప్రయోజనాలతో నిమిత్తం లేకుండా చిత్తశుద్ధితో ఏ కార్యక్రమం చేసినా.. అవన్నీ అంబేద్కర్ ఆలోచన నుంచి వచ్చినవేనని పేర్కొన్నారు. కొలంబియా వర్సిటీలో అంబేద్కర్‌కు విగ్రహం ఏర్పాటు చేసి ఘనంగా నివాళులు అర్పించారని, వారక్కడ ఆధునిక భారత నిర్మాతగా కొనియాడారని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తుచేశారు. ఆయన జయంతిని పురస్కరించుకుని ప్రపంచవ్యాప్తంగా వందకుపైగా దేశాల్లో అంబేద్కర్‌ను స్మరించుకుంటున్నారని, గుర్తుచేసుకుంటారని ఇది మనందరికీ గర్వకారణమని చెప్పారు. సమాజంలో సమానత్వం రావాలంటే రాజ్యాంగ స్ఫూర్తి కొనసాగించాల్సిన అవసరముందని కేటీఆర్ వెల్లడించారు. ప్రజలంతా అంబేద్కర్ ఆలోచనలు, ఆశయాల కోసం కలిసి పనిచేయాల్సిన అవసరమున్నదని, ఇదే మనం అంబేదర్‌కు అర్పించే నిజమైన నివాళిగా కేటీఆర్ అభివర్ణించారు. ఆ దిశగా అందరం కలిసి ముందుకు సాగుదామని పార్టీ నేతలకు పిలుపునిచ్చారు.

అంబేద్కర్‌కు కాంగ్రెస్ అవమానం

- దళిత సమాజానికి రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలి
- 125 ఫీట్ల అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేయరా?
- ఇదేం అహంకారం, దుర్మార్గం
- సీఎం రేవంత్‌ది ఫ్యూడల్ మనస్తత్వం.. ఇంత జరుగుతున్నా మౌనమేల భట్టీ!
- మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ నిలదీత

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత బాల్కసుమన్

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను దారుణంగా అవమానించిందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ ఆరోపించారు. సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వద్ద ఎలాంటి అలంకరణలు చేయలేదని, కనీసం పూలమాల వేయలేదని మండిపడ్డారు. సీఎం రేవంత్‌కు ఇంత దుర్మార్గం? ఇంత అహంకారం? ఇంత కండ్లుమూసుకుపోయిన టెంపరితనమేంటని ప్రశ్నించారు. భేషరతుగా రేవంత్ దేశ ప్రజలకు, దళిత సమాజానికి భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణభవన్‌లో సహచర నేతలు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ తదితరులతో కలిసి ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. ప్రపంచంలోనే అతి పెద్దదైన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం కేసీఆర్ ఏర్పాటుచేశారనే అక్కడ అలంకరణలు చేయలేదా? దీనికి సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టామని, కేసీఆర్ కట్టిన సచివాలయంలో రేవంత్ ఎలా కూర్చుంటున్నడని ప్రశ్నించారు. తెలంగాణలో కేసీఆర్ గుర్తులను చెరిపేస్తామని రేవంత్ అన్నారని, కాళేశ్వరం నీళ్లను రైతులకు అందకుండా రేవంత్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని విమర్శించారు. సీఎం ఫ్యూడల్ మైండ్ సెట్‌తో ఉన్నారని. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎందుకు మౌనం పాటిస్తున్నారని ప్రశ్నించారు. స్వయంగా భట్టికి అవమానం జరిగినా ఆయనే పట్టించుకోకపోగా, కనీసం అంబేద్కర్ అవమానించినా స్పందించకపోవడం అత్యంత దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. భట్టికి చిన్నపీట వేసినా మౌనంగా ఉన్నారని, అంబేద్కర్ రిజర్వేషన్లతోనే భట్టి డిప్యూటీ సీఎంగా అయ్యారన్నారని గుర్తుచేశారు. దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచిన రేవంత్‌రెడ్డి సర్కారు తీరుపై దళిత సంఘాలు, మేధావులు స్పందించాలని కోరారు. గతంలో అనేక విషయాలపై స్పందించిన లౌకికవాదులు, మేధావులు నోరు విప్పాలని సూచించారు. రేవంత్‌రెడ్డి నయా దేశ్ ముఖ్‌లాగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వద్ద కనీసం పరిసరాలను శుభ్రం చేయలేదని, విగ్రహానికి కనీసం దండవేయలేదని, దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

బీజేపీ అబద్ధాల ఫ్యాక్టరీ..

దేశంలో బీజేపీ దుర్మార్గపు, అరాచకపాలనను కొనసాగిస్తున్నదని బాల్క సుమన్ మండిపడ్డారు. బీజేపీ అబద్ధాల ఫ్యాక్టరీ అని, బీజేపీ మ్యానిఫెస్టో అంతా అబద్ధాల మయమని అభివర్ణించారు. ఎమ్మెల్సీ కవిత అరెస్టు విషయంలో అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. మోదీతో జోడికట్టకపోతే ఈడీ, సీబీఐ వస్తాయని విమర్శించారు. ఉత్తర భారతంలో కొరకరాని కొయ్యగా మారిన కేజ్రీవాల్‌ను అరెస్టుచేశారని, దక్షిణాదిలో కేసీఆర్ కుమార్తె కవితను అన్యాయంగా జైళ్లోపెట్టారని ఫైరయ్యారు. లిక్కర్ పాలసీ కేసుతో సంబంధమున్న మాగుంట శ్రీనివాస్‌రెడ్డి ఏపీలో ఎన్డీఏ అభ్యర్థిగా పోటీచేస్తున్నారని, అజిత్‌పవార్, ప్రఫుల్‌పటేల్, హిమంత బిశ్వ శర్మ, ఏపీలో సీఎం రమేశ్, కొత్తపల్లి గీత, సుజనాచౌదరి, అమరీందర్‌సింగ్, సువేందు అధికారి బీజేపీలో చేరగానే కేసులు మాఫీ చేశారని గుర్తుచేశారు. బీజేపీ వాషింగ్ పౌడర్ నిర్మాలా మారిపోయిందని మండిపడ్డారు. కక్షగట్టి కేసీఆర్‌ను ఏం చేయలేక కవితను అరెస్టు చేశారని విమర్శించారు. మోదీతో కుమ్మక్కు అయ్యే రేవంత్‌రెడ్డి అనేక పార్లమెంట్ స్థానాల్లో బలహీన అభ్యర్థులను బరిలో దింపారని ఆరోపించారు. బడేబాయ్, చోటేబాయ్ ఒక్కటయ్యారని, పార్లమెంట్ ఎన్నికల తర్వాత రేవంత్ బీజేపీలో చేరతారని ఆరోపించారు. బీఆర్ఎస్‌కు రాష్ట్రంలో 10 లోక్‌సభ స్థానాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
నల్లగొండ	41.1°c	24.0°c
ఖమ్మం	41.0°c	28.0°c
మహబూబ్‌నగర్	39.8°c	27.5°c
మెదక్	39.4°c	21.4°c
రంగారెడ్డి	39.0°c	21.4°c
హైదరాబాద్	38.3°c	26.4°c
కరీంనగర్	38.0°c	27.0°c
వరంగల్	37.0°c	26.0°c
ఆదిలాబాద్	35.4°c	22.4°c
నిజామాబాద్	27.8°c	23.2°c

ఎమ్మెల్సీ కవితను కలిసిన కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): ఢిల్లీలోని తీహార్ జైలులో ఉన్న ఎమ్మెల్సీ కవితను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం కలిశారు. ములాఖత్ సందర్భంగా కేటీఆర్‌తోపాటు ఆమె భర్త అనిల్ కూడా కలిశారు. వీరు జైలు నుంచి బయటికొచ్చాక అక్కడున్న న్యాయవాదులతో చర్చించారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తదితరులు ఉన్నారు.

25 వరకు ఎండలు తక్కువే

- 18 నుంచి 25 వరకు మోస్తరు వానలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పలు జిల్లాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా వాతావరణం కాస్త చల్లబడింది. మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు కాస్త పడిపోయాయి. వచ్చే పది రోజులపాటు అంటే.. ఈ నెల 25 వరకు రాష్ట్రంలో తీవ్రమైన ఎండలు, వడగాడ్పులు ఉండవని, సాధారణ ఉష్ణోగ్రతలు మాత్రమే నమోదవుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రంలో ఈ నెల 18 నుంచి 25 వరకు ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణశాఖ అంచనా వేసింది. రాజస్థాన్ మీదుగా నైరుతి రుతుపవనాలు తుఫానుగా మారి కోస్తా కర్ణాటక వరకు వ్యాపించాయని తెలిపింది. మరో ఐదురోజుల పాటు హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నది. మరోవైపు గురు, శుక్ర, శని, ఆదివారాల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది.

కొత్తగొచ్చినోళ్లు మాదిగలను మరుస్తున్నరు

మొదటిపేజీ తరువాయి...

తెలిపారు. ఆ పార్టీకి వచ్చే ఎన్నికల్లో మాదిగలు ఓటు వేయరని జోస్యం చెప్పారు. బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆదివారం ఎల్బీనగర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో సమర్థులైన నాయకులు, గెలుపు గుర్రాలు లేనట్టు వరంగల్ ఎంపీ టికెట్‌ను ఎమ్మెల్యే కడియం శ్రీహరి బిడ్డ కావ్యకు ఇవ్వడమేమిటని ప్రశ్నించారు. కడియం శ్రీహరి ఎవరూ మాదిగనా? మాలనా? లేక పోతే బ్యాక్‌వర్డ్ క్లాసా? అనేది ఇంకా తేలాల్సి ఉన్నదని, శ్రీహరి ఎస్సీ రిజర్వేషన్‌కు తగడని విమర్శించారు. ఆయన కుటుంబానికి ఎస్సీ రిజర్వేషన్ కింద కాంగ్రెస్ పార్టీ సీటు ఇవ్వకూడదని సూచించారు. ఆయనే ఒకానొక సందర్భంలో 'నేను మాదిగను కాదు.. నాకు రిజర్వేషన్ వద్దు అన్నడు..' మళ్లీ ఈ రోజు తన బిడ్డను ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో నిలిపాడని విమర్శించారు. కడియం బిడ్డ కావ్య హిందువే కాదు.. ఆమె వేరే మతానికి చెందిన వ్యక్తిని పెళ్లి చేసుకుందని తెలిపారు. దీనిపై ఆధారాలు సేకరిస్తున్నారని ఆమెపై అనర్హత వేటు పడే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. ఈ సీటు ఎంపికపై కాంగ్రెస్ హైకమాండ్ పునరాలోచించాలని సూచించారు. కావ్యకు ఇంకా కాంగ్రెస్ బీఫాం ఇవ్వనందున అభ్యర్థిని మార్చాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లోను వరంగల్ సీటు మాదిగలకే ఇవ్వాలని, ఇస్తారన్న నమ్మకం ఇప్పటికీ తనకు ఉన్నదని చెప్పారు. మాదిగలకు సీటు ఇవ్వకపోతే మాదిగలు వారి కోపాన్ని చూపించి వరంగల్‌లో ఓడగొడతారని హెచ్చరించారు. ఇతర పార్టీ నుంచి తీసుకొచ్చి కాంగ్రెస్ పార్టీలో సీటు ఇవ్వడం ఏమిటని సర్వే ప్రశ్నించారు. మరీ ముఖ్యంగా మాదిగలంతా ఒక్కటయ్యారని, ఒకవేళ కాంగ్రెస్ పార్టీ న్యాయం చేయకపోతే మాదిగలు ఓటు వేయరని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జోగు రాములు, ఆడాల రమేశ్, చామకూర రాజు, కేవీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగ నేతలకు రేవంత్ బురిడీ!

- రాజ్యసభ, ఎమ్మెల్సీ పదవులు ఇస్తామని హామీ
- పెద్దల సభలో రెండేండ్ల తరువాతే ఖాళీలు
- ఎమ్మెల్సీ ఖాళీలు ఏర్పడాలన్నా ఏడాది ఆగాల్సిందే
- ముఖ్యమంత్రిని కలిసిన గజ్జెల కాంతం, పిడమర్తి రవి, వరప్రసాద్

హైదరాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): ఎంపీ టికెట్ల పంపిణీలో తమ సామాజిక వర్గానికి కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేసిందంటూ ఆందోళనబాట పట్టిన మాదిగ నేతలను ఆ పార్టీ మరోసారి బురిడీ కొట్టించింది. రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయగలిగే స్థాయిలో దాదాపు 70 లక్షల మంది జనాభా కలిగిన మాదిగలకు రాజ్యసభ, ఎమ్మెల్సీ పదవులు ఇస్తామని ఆదివారం తనను కలిసి ఆ సామాజిక వర్గం నేతలకు పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. అయితే, రాజ్యసభలో మరో రెండేండ్ల వరకు, శాసనమండలిలో మరో ఏడాది వరకు ఖాళీలు ఏర్పడే అవకాశమే లేదని, అలాంటప్పుడు ఆ పదవులు ఎలా ఇస్తారని అదే సామాజికవర్గానికి చెందిన మరికొందరు నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే, ఎంపీ టికెట్ల విషయంలో బురిడీ కొట్టించిన విధంగానే కొత్తగా ఆశ చూపుతున్న పదవుల విషయంలోనూ హ్యాండిచ్చే అవకాశం ఉన్నదని, కాబట్టి ఉత్తుత్తి హామీలను నమ్మొద్దని హెచ్చరిస్తున్నారు.

రాజ్యసభకు రెండేండ్ల వరకు అవకాశం లేదు

ఇటీవల రాజ్యసభలో రాష్ట్రం నుంచి ఖాళీ అయిన మూడుస్థానాల్లో రెండింటిని కాంగ్రెస్ (అనిల్‌కుమార్ యాదవ్, రేణుకాచౌదరి), ఒకటి (వద్దిరాజు రవిచంద్ర) బీఆర్ఎస్ దక్కించుకున్నాయి. మరో రెండేండ్ల వరకు రాజ్యసభలో ఖాళీలు ఏర్పాడే అవకాశం లేదు. ఎంపీలు కేఆర్ సురేశ్‌రెడ్డి, కే కేశవరావు పదవీ కాలం 2026 ఏప్రిల్ 9తో ముగియనున్నది. మరో ఇద్దరు సభ్యులు పార్థసారథిరెడ్డి, దామోదర్‌రావు పదవీ కాలం 2028 జూన్ 21 వరకు ఉన్నది. కొత్తగా ఎన్నికైన ముగ్గురు సభ్యుల (వద్దిరాజు రవిచంద్ర, అనిల్‌కుమార్, రేణుకా చౌదరి) పదవీకాలం 2030 ఫిబ్రవరి 19 వరకు కొనసాగుతుంది. అలాంటప్పుడు మాదిగ నేతలకు రాజ్యసభ పదవులు ఇప్పట్లో ఇవ్వడం ఎలా సాధ్యమన్న ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. రెండేండ్ల తర్వాత అధికార కాంగ్రెస్ పార్టీలో ఎవరు ఏ పదవిలో ఉంటారో, అసలు రేవంత్‌రెడ్డి అప్పటికి పదవిలో ఉంటారన్న గ్యారెంటీ ఏమున్నదని కొందరు ప్రశ్నిస్తున్నారు.

ఎమ్మెల్సీల ఖాళీలకు ఏడాది ఆగాలి

ఎమ్మెల్యేల కోటాలో ఎన్నికైన ఐదుగురు ఎమ్మెల్సీల (శేరి సుభాష్‌రెడ్డి, సత్యవతిరాథోడ్, యెగ్గే మల్లేశం, మహమూద్ అలీ, మీర్జా రియాజ్‌హసన్) పదవీకాలం 2025 మార్చి 29తో ముగియనున్నది. అంటే దాదాపు మరో ఏడాది వరకు ఎమ్మెల్సీ పదవులు ఇచ్చే అవకాశం లేదు. ఇక ఉపాధ్యాయ కోటాలో కానీ, గవర్నర్ కోటాలో కానీ ఎమ్మెల్సీల పదవులు పొందడానికి అవకాశమే లేదు. స్థానికసంస్థల కోటాలో ఎంఎస్ ప్రభాకర్ (హైదరాబాద్) పదవీ కాలం 2025 ఆగస్టు 6న ముగియనున్నది. స్థానిక సంస్